ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

పంటలకు నీటి ఎద్దడి

- పల్నాడు జిల్లాలో మిర్చి రైతుల పాట్లు
- డెల్టాలో జొన్న,మొక్కజొన్నకు తప్పని సమస్య

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో పంటలకు నీటి ఎద్దడి పెరుగుతోంది. డిసెంబరు 4,5 తేదీల్లో సంభవించిన మిచౌంగ్ తుపాను తరువాత మళ్లీ వర్షాల్లేకపోవడంతో పంటలకు నీటి సమస్య ఏర్పడింది. అయితే దాదాపు 65 రోజులుగా వర్షాలు లేకపోవడం వల్ల నీటిఎద్దడి పెరిగింది. మరో వైపు ఎగువ నుంచి ప్రవాహం కూడా లేకపోవడం వల్ల నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి.

పులిచింతల జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ఆదివారం సాయంత్రం 6.20 టిఎంసిల నీటి నిల్వ మాత్రమే ఉంది. అలాగే నాగార్జున సాగర్‌లో గరిష్టనీటి నిల్వ 312 టిఎంసీలు కాగా ప్రస్తుతం 144.94 టిఎంసిలు మాత్రమేనీటి నిల్వ ఉంది. మొత్తం నిల్వలో 50 శాతం కంటే తక్కువగా ఉండటాన్ని డెడ్ స్టోరేజీగా పరిగణిస్తారు. ప్రస్తుతం తాగునీటికి తప్ప సాగునీటికి నీటిని విడుదల చేసే అవకాశం లేదని అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 1.70 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చికి ఇంకా కనీసం రెండు తడులు అవసరం ఉంది. గత 65 రోజులుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత పెరగడం వల్ల మిర్చిపంటను కాపాడుకునేందుకు రైతులునానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, కంది తదితర పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉంది.

గుంటూరు, పల్నాడు జిల్లాలో రబీలో అపరాల సాగు కూడా తగ్గింది. రబీలో గుంటూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో పంటలనుసాగు చేయాల్సి ఉండగా కేవలం 1.25లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 85 వేల ఎకరాల్లోనే రబీ పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో కంది విస్తీర్ణం మాత్రం స్వల్పంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణం 2500 ఎకరాలు కాగా ఈఏడాది 11వేల ఎకరాల్లో కంది సాగు చేశారు. గుంటూరు జిల్లాలో 51 వేల ఎకరాలు జొన్న సాగు చేస్తారని అంచనా కాగా 25 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న సాగు కూడా 52 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా కాగా ఇప్పటి వరకు కేవలం 31 వేల ఎకరాల్లోనే వేశారు. 22 వేల ఎకరాల్లో శనగ సాగు చేస్తారని అంచనా ఉండగా నవంబరులోనే 26 వేల ఎకరాల్లో శనగ వేశారు. అయితే ▶ 2లో

42కు పెరిగిన డయేరియా కేసులు

- జిజిహెచ్‌లో 24 గంటలూ వైద్యం - హెల్ప్‌లైన్ ఏర్పాటు
- కలెక్టర్, కమిషనర్‌తో వైద్యారోగ్య శాఖ మంత్రి సమీక్ష

వార్త మెయిన్‌లో

మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

డయేరియా బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక శారదా కాలనీలో కలుషిత తాగునీటి వల్ల డయేరియాతో చనిపోయిన ఎం.పద్మ కుటుంబ సభ్యులను, ఇతర డయేరియా బాధితులను సిపిఎం బృందం ఆదివారం పరామర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ పద్మ కుటుంబ పరిస్థితి కడు దయనీయంగా ఉందన్నారు. నెలన్నర క్రితం ఆమె తండ్రి చనిపోయాడని, తల్లికి వెన్నుపూస ఆపరేషన్ జరిగి పూర్తిగా మంచానికే పరిమితమైందని చెప్పారు. పద్మ తర్వాత మిగిలిన ఐదుగురు సంతానికి, ఆమె తల్లికి ఇప్పటి వరకూ ఆమే ఆధారమన్నారు. పద్మ మృతితో ఆ కుటుంబం ఆదారం కోల్పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, బాధితురాలి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాదితుల్ని పరామర్శించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జీవన్, తదితరులున్నారు.

వాగ్దానాలను విస్మరించి మోసం చేసిన కేంద్రం

బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు 16న నిరసన - గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె

లోపలి పేజీల్లో

సమ్మె ఒప్పంద హామీలు అమలు చేయాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

15న ఫిరంగిపురానికి ముఖ్యమంత్రి రాక

ప్రజాశక్తి-ఫిరంగిపురం : ఫిరంగిపురంలో ఈనెల 15వ తేదీన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటున్నందున ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, బ్యారీకేడ్లు, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీఖర్, ఆర్ అండ్ బి ఇంజినీర్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మతం విడగొడితే.. సైన్స్ కలుపుతుంది..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విజేతలకు బహుమతులిస్తున్న నిర్వాహకులు

మానవులంతా ఒకటేనని, సైన్స్ మనందరందరినీ కలుపుతుందనీ, మతాలు మాత్రమే మనలను విడగొడతాయని నెల్లూరు ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా సాహెబ్ అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని నారా యణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జనవి జ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో రెండ్రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన 'హూ ఐ యాం (నేను ఎవరిని?)' అంశంపై ప్రజెంటేషన్ చేశారు. మైటోకాండ్రియాలోని డిఎన్ఎ మన తల్లి ఎవరో చెబుతుందని, క్రోమోజోమ్‌లో ఉన్న డిఎన్ఎ తల్లి, తండ్రి ఎవరో చెబుతుందని వివరించారు. ప్రస్తుతమున్న ప్రపంచంలోని 750 కోట్ల మందికి మూలాలు ఆఫ్రికాలోనే ఉన్నాయని తెలిపారు. రుజువైన దానిని నమ్మడం, నిత్యజీవితంలో సైన్స్‌ను ఆచరించడం ద్వారా మాత్రమే సమాజం అభ్యున్నతి సాధిస్తుందని అన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విభాగాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విద్యార్థినీ విద్యా ర్థులు పాల్గొని సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా విభాగాల వారీగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహు మతులు, ధ్రువపత్రాల ప్రదానంతోపాటు పాల్గొన్న అందరికీ ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందించారు. సంబంరాల నిర్వహణకు సహకరి ంచిన, హాజరైన వారికి జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడికొండ

మండల పరిధిలోని పాములపాడులో రూ. 61 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, వైసిపి తాడికొండ సమన్వయకర్త ఎం.సుచరిత ఆదివారం ప్రారంభించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. అమ్మబడి, చేయూత మొదలైన పథకాల గురించి వివరించారు. గ్రామ సచివాలయాల ద్వారా పరిపాలన ఇంటివద్దకే తెచ్చిన ఘనత జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం తాడికొండలోని రావిచెట్టు సెంటర్ నుండి జయభారత్ కాలనీ వరకు రూ.60 లక్షలతో బి.టి రోడ్డుకు బందర్ పోర్టు ఎమ్‌డి ఎం.దయాసాగర్ శంకుస్థాపన చేశారు. జెడ్‌పిటిసి జి.జ్యోతి, సర్పంచ్ టి.సరోజినీ నరసింహారావు, బి.శజవరామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు బి.వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు టి.శివనాగరాజు, బి.పున్నారావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తాడికొండ పోలీస్‌స్టేషన్ వద్ద అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని సుచరిత ఆవిష్కరించారు. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతత్వం అంబేద్కర్ ఆశయమని చెప్పారు. రిజర్వేషన్ల సౌకర్యం వలన నేడు మహిళల సైతం ప్రజాప్రతినిధులుగా ఉన్నారని అన్నారు.

50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక రామనాథం చిన్నకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవాశ్రమంలో ఆదివారం ఆశ్రమ అధ్యక్షుడు రామనాథం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 105వ కంటి పరీక్ష శిబిరం జరిగింది. పరీక్షలు చేయించుకున్న వారిలో 50 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు టి.కిరణ్, విజయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.స్వాతి, రవితేజ ట్రేడర్స్ అధినేత వి.నాగకోటేశ్వరరావు, పిరమిడ్ మాస్టర్ డి.సాంబశివరావు పాల్గొన్నారు.

200 మందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక బోసు రోడ్డులో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమానికి వాసవి వనిత ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, క్లబ్ మాజీ గవర్నర్, గోల్డెన్ స్టార్ గ్రహీత కె.కల్యాణి ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు వస్త్రాలు అందించి మాట్లాడారు. పట్టణంలో సుమారు 200 మంది పేదలు, వితంతువులు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేసినట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘంఅధ్యక్షులు ఎ.సాంబశివరావు, సెక్రటరీ భాస్కరుని ప్రసాద్, కోశాధికారి ఎంఎస్ఆర్ గుప్త తెలిపారు. అపర కర్మసాల అధ్యక్షులు పి.శ్యామలరావు, ఎం.తిరుమలేశ్వరరావు, జి.రామకోటేశ్వరరావు, జి.పిచ్చయ్య, డి.శ్రీనివాసరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రెడాయ్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులో బాలాజీనగర్ వద్ద క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన భవనాన్ని క్రెడాయ్ రాష్ట్రచైర్మన్ ఆళ్ల శివారెడ్డి, తెలంగాణ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. శివారెడ్డి ఈ భవనానికి స్థలాన్ని సంస్థకు బహూకరించారు. భవన నిర్మాణానికి కూడా ఆయన తన వంతు సహకరించారని, అందువల్ల ఆళ్ల శివారెడ్డి భవన్‌గా పేరుపెట్టినట్టు క్రెడాయ్ చాప్టర్ గుంటూరు శాఖ అధ్యక్షులు మామిడిరాము తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మామిడి రాము అధ్యక్షత వహించారు. క్రెడాయ్ జాతీయ కార్యదర్శి జి.రామిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశంలో భవన నిర్మాణ రంగం వృద్ధిలో క్రెడాయ్ పాత్ర కీలకమన్నారు. రాష్ట్రంలో క్రెడాయ్ అభివృద్ధికి ఆళ్ల శివారెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. తెలంగాణ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో క్రెడాయ్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్‌కు ఇప్పటి వరకు సొంత భవనం లేదన్నారు. ఇందుకోసం తన వంతుగా స్థలం ఇచ్చి భవన నిర్మాణానికి కృషి చేసినట్టు వివరించారు. క్రెడాయ్ జాతీయ కార్యదర్శి బి.రాజా శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు వై.వి.రమణరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి, చాప్టర్ ట్రజరర్ మద్ది నాగవెంకట కార్తీక్, మెట్టు సాంబశివారెడ్డి, డిఎన్‌డిఎల్ సురేష్, ఆళ్ల నాగార్జున పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కె.అన్నమ్మ

ఎఎన్ఎంలపై పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎఎన్ఎంలపై పని భారం తగ్గించాలని యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కె.అన్నమ్మ కోరారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో మంగళగిరి డివిజన్ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి ఎం.శశి అధ్యక్ష వహించారు. అన్నమ్మ మాట్లాడుతూ ఎఎన్ఎంలు క్షేత్రస్థాయిలో పని ఒత్తిడి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏపీపీఎస్ ఆన్లైన్ పేరుతో పని భారం బాగా పెంచింది అన్నారు. సీనియార్టీ లిస్టు తయారుచేసి ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. వైయస్సార్ కంటి వెలుగులో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌లకు ఎఎన్ఎంగా సర్వీసులోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో టి.కృష్ణకుమారి, ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

జెండాను దహనం చేశారని రాస్తారోకో

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రులో టిడిపి జెండాలను వైసిపికి చెందినవారు దహనం చేశారని, జెండాకున్న తాడుతో బస్సు షెల్టర్‌పై వైసిపి జెండాను కట్టారని ఆగ్రహిస్తూ టిడిపి శ్రేణులు పచ్చలతాడిపర్రులో ఆదివారం రాస్తారోకో చేశారు. ఇలాంటి చర్యలు తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేవన్నారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుంటే న్యాయం పోరాటం చేస్తామని చెప్పారు. గతంలోనూ ఇదేమాదిరి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా చర్యలేమీ లేవని విమర్శించారు. రాస్తారోకో విరమించాలని పోలీసులు కోరగా తొలుత టిడిపి శ్రేణులు అంగీకరించలేదు. జెండా దహనం నిందితులను అరెస్టు చేస్తామని హామీనివ్వడంతో ఆందోళన ముగిసింది. అనంతరం పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బి.భార్గవ్‌కు ఫిర్యాదు చేశారు. టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు బి.బాబురావు, పి.అహ్మద్ ఖాన్, నాయకులు జె.సుధీర్, ఎం.వెంకటేశ్వరరావు, సోంబాబు, శేషగిరిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి నియోజకవర్గ కార్యాలయాన్ని పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కనున్న ఆర్‌ఆర్ కన్వెన్షన్ పక్కన ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. పనులను ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, చిరంజివి, నాయకులు ఆర్.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. కార్యాలయాన్ని రెండ్రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డి.వేమారెడ్డి, ఎం.మల్లేశ్వరరావు, ఎ.రాజేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుని గృహ నిర్బంధం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

డీఎస్సీ నోటిఫికేషన్ విషయంలో ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ చేపట్ట తలపెట్టిన ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి నేపథ్యంలో పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా రవీంద్రనాథ్‌ను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ తీరును, పోలీసుల చర్యలు రవీంద్రనాథ్ ఖండించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌కె సలీం ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీటి ఎద్దడి

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 10 వేల ఎకరాల్లో శనగ పైరు తుపానుకు నీట మునిగి దెబ్బతింది. 9500 ఎకరాల్లో మినుము సాగు అవుతుందని అంచనా వేయగా కేవలం 15 వేల ఎకరాల్లో సాగు అయింది. పెసర 22 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 21 వేల ఎకరాల్లో చేశారు. పల్నాడు జిల్లాలో 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయాల్సి ఉండగా 7500 ఎకరాలలో సాగు చేశారు. 25 వేల ఎకరాల్లో శనగ సాగుచేస్తారని అంచనా కాగా 43 వేల ఎకరాల్లో సాగు చేశారు. 5 వేల ఎకరాల్లో మినుము సాగు చేయాల్సి ఉండగా నాలుగు వేల ఎకరాల్లోనే సాగు చేశారు.

ఈఏడాది ఖరీఫ్ సీజన్ ముగిసే సమయంలో తీవ్ర వర్షాభావం ఏర్పడటం, అక్టోబరు మొత్తం వర్షాలు లేకపోవడం, 21 రోజుల పాటు వేడిగాలలు వీయడం, నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో రబీ సాగు పూర్తిస్థాయిలో జరగలేదు. డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపాను వచ్చి ఖరీఫ్ పంటలను నష్టం చేకూర్చినా అధిక వర్షాల వల్ల రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగుకు రైతులను నడిపించింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక వర్షాల వల్ల దాదాపు వారం పాటు

పొలాల్లో నీరు నిలిచిపోవడంతో భూమి తేమ బాగా ఉండటం, తరువాత వర్షాలు ఎంతో కొంత కురుస్తాయన్న నమ్మకంతో రైతులు రబీ సాగుకు ఉపక్రమించినా కొద్దిరోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో కొద్దిపాటి నీటి సరఫరా కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత కక్షలతో దాడి.. చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పాత కక్షలతో సురేష్ నాయక్ అనే వ్యక్తిని, అతని స్నేహితుడు దాడి చేసిన ఘటనలో సురేష్ ఆదివారం గుంటూరులోని ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6వ తేదీ సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయం లో సురేష్ నాయక్(40), అతను బావ మరిది దొప్పలపూడి రవితేజ, స్నేహితులు కంభంపాటి వేణు, కేతవత్ భీమానాయక్ , భూక్యా వెంకటేశ్వర్లు నాయక్ లు కలసి చిలకలూరిపేట పట్టణ శివార్లలోని సింగ్ నగర్ ఏరియాలోని ప్రభుత్వ వైన్స్ దగ్గర మద్యం సేవించేందుకు వెళ్లారు. గతంలో సురేష్ నాయక్ కి, వెంకటేశ్వర్లు నాయక్ మధ్య డబ్బు విషయమై పలుమార్లు గొడవ జరిగింది. ఈ విషయాన్ని మనసులో ఉంచుకున్న వెంకటేశ్వర్లు నాయక్ అనిపై కక్ష పెంచుకున్నాడు. సురేష్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ వైన్స్ లో మద్యం కొనుగోలు చేసి ఆ పక్కనే ఉన్న చేలలో తాగేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న నల్లని నాప రాయి తీసుకొని సురేష్ తలపై కొట్టాడు. దీంతో స్పృహ కోల్పోయి పడిపోయాడు. రవితేజ, వేణు, భీమా నాయక్ లు కలసి వెంకటేశ్వర్లు నాయక్ వద్ద ఉన్న రాయిని తీసుకుని పక్కన పడ వేసి ఈ విషయమై అతనితో వాదించారు. దీంతో, వెంకటేశ్వర్లు నాయక్ అక్కడ నుండి పారిపోయాడు. స్పృహ కోల్పోయిన సురేష్‌ను రవితేజ్, సీతయ్య నాయక్‌లు ఆతని ఇంతకి తీసుకువెళ్లారు. సురేష్ భార్య శ్రావణిబాయికి అతన్ని అప్పగించారు. సురేష్‌ని అతని భార్య చిలకలూరిపేటలోని ప్రభుత్వ హాస్పిటల్ తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించింది. మెరుగైన వైద్యం కోసం సురేష్‌ని 108 లో గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. ఐ సి యు.లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 11.39 గంటల సమయంలో అతను మృతి చెందినట్టు పోలీసులు

మృతుడు సురేష్ నాయక్

తెలిపారు. శ్రావణిబాయి ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట పట్టణ సి.ఐ పి.రమేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన సురేష్ నాయక్ రోజువారీ కూలి పనులకు వెళ్తుంటాడని, ఇతనికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు చెప్పారు. నిందితుడు భూక్యా వెంకటేశ్వర్లు నాయక్ పరారీలో ఉన్నాడు. రెండు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్ట్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి. భాస్కర్ అన్నారు. పొన్నూరు పట్టణం 10వ వార్డు ఎరుకుల వాడలో మేచర్ల జ్యోతి అనే ఆమె అక్రమంగా మద్యం విక్రయిస్తుందన్న సమాచారంతో అర్బన్ సిఐ పి. భాస్కర్ ఆదేశాల మేరకు సిబ్బంది వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుండి 7క్వార్టర్ బాటిళ్లను స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు . కేసు నమోదు చేసి త్వరలో కోర్టుకు హాజరు పరుస్తామని అన్నారు.

అసంపూర్తి రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని యర్రబాలెం లో అసంపూర్తిగా నిలిచిన రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం యర్రబాలెంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆందోళన చేశారు. రామాలయం సెంటర్ నుంచి గోశాల వరకూ సుమారు రూ.1.05కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణాన్ని, గోశాల వద్ద నుంచి సుమారు రూ.1.83 కోట్లతో సీసీ రోడ్డు విస్తరణ పేరుతో పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న సిమెంట్ రోడ్డుపై కంకర, డస్ట్ తోలించి వదిలేయడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఎల్.సాయి నందన్, బి.అంజయ్య, నీలాంబరం, పావని పాల్గొన్నారు.

నిందితులు ఎలాంటి వారైనా శిక్ష పడాల్సిందే

చిర్రావూరులో దాడికి గురైన రేషన్ ఎమ్‌డియు ఆపరేటర్‌కు బాపట్ల ఎంపి పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇటీవల అగ్రవర్ణాల దాడికి గురైన చిర్రావూరుకు చెందిన రేషన్ వాహనదారుడు (ఎమ్‌డియు) రాజశేఖర్‌ను బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దాడి చేసిన వారందరూ టిడిపికి చెందిన వారేనని, వారిని వదిలిపెట్టేది లేదని అన్నారు. సిఎం వైఎస్ జగన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. టిడిపికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, కులాలంటే చిన్నచూపన్నారు.

రాజశేఖర్ ను పరామర్శించి, మాట్లాడుతున్న నందిగం సురేష్

కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.సాంబశివరావు, కె.బాజీ గంగాధర్ రావు, శివాలయం చైర్మన్ ఎం.నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఉండవల్లిలో టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లిలో టిడిపి నూతన కార్యాలయాన్ని మంగళగిరి నియోజకవర్గ సమన్వరకర్త నందం అబద్దయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. మంగళగిరిలో లోకేష్ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. అనంతరం చిరు వ్యాపారులకు నాలుగు తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు గాదె శ్రీనివాసరావు, కళ్లం రాజశేఖరరెడ్డి, పాలెపు

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

రామారావు, డి.జ్యోతిబసు, జానకీదేవి, అమరా సుబ్బారావు, కొల్లి శేషు, నామాల నాగేశ్వరరావు, జంగాల సాంబశివరావు పాల్గొన్నారు.

ఎకాట స్థావరం వద్ద నిందితులతో పోలీసులు

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బోడెపూడివారిపాలెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు చేశారు.ఈ దాడులలో పేకాట స్థావరం వద్ద ఉన్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.28,990 లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని శృంగారపురం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం కోడిపందాల స్థావరంపై దుగ్గిరాల పోలీసులు దాడి చేశారు .ఈ క్రమంలో కొందరు పారిపోగా ఒక కోడి 2050 రూపాయల నగదు మరియు ఆరుగురిని అదుపులో తీసుకున్నారు. కోడి పందాలు వేసే వారిపై దుగ్గిరాల ఎస్సై సిహెచ్ ప్రతాప్ కుమార్ నిఘా ఉంచి సిబ్బందితో దాడి చేశారు. కోడి పందాలు పేకాటలు ఆడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

జర్మనీ యాత్రికులను సన్మానిస్తున్న ప్రభాకరరెడ్డి

దుర్గగుడిలో జర్మనీ యాత్రికులు

ప్రజాశక్తి-తాడేపల్లి: విజయవాడ కనకదుర్గ గుడిని ఆదివారం జర్మనీకి చెందిన ప్రముఖ బోస్చ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ స్టెఫానీ, మార్టిన్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లికి చెందిన దుర్గగుడి ప్రత్యేక ఆహ్వానితులు కె.ప్రభాకరరెడ్డి వారిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మురళీకృష్ణకు బెస్ట్ సర్వీస్ ఇంజనీర్ అవార్డు

ప్రజాశక్తి - చేబ్రోలు

మండలంలోని పాత రెడ్డిపాలేనికి చెందిన మురళీకృష్ణ కొమరవల్లి ముంబాయికి చెందిన మెట్లర్ టోలిడో సంస్థ నుండి అవార్డు అందుకున్నారు. వైజాగ్ ఫార్మసీ కంపెనీలో ప్రోగ్రామింగ్ ఇంజనీర్ విభాగంలో పనిచేస్తున్న మురళీకృష్ణ

ఇంజినీరింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను అవార్డును సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ప్యాట్రిక్ కల్టన్ బాచ్ నుండి అందుకున్నారు. ఉత్తమ సేవా ఇంజనీర్ పురస్కారాన్ని అందుకున్నందుకు మురళీకృష్ణకు సహకర ఉద్యోగులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని బిసిల పాదయాత్ర ఆదివారం తాడేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ దోభి సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. వృత్తి పరికరాలు ఇచ్చి రజకులను మోసం చేయొద్దన్నారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే షెడ్యూల్డ్ క్యాస్ట్ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

GURAZALA NAGAR PANCHAYAT

E-Procurement Notice

Short Tender Notice No. GZL/2023-24/JA, Dt.11-02-2024

1	General Funds No. of Works/value	15No/Rs.48.19 lakhs
2	Bid Document Download Starting Date& Time	11-02-2024at 11:00A.M
3	Bid Document Download End Date& Time	17-02-2024at 03:30P.M
4	Bid Submission Closing Date& Time	17-02-2024at 04:00P.M
5	Commercila Bid Opening Date &Time	17-02-2024at 04:01P.M

E-Tender Website:http//tender.apeprocurement.gov.in/
E-Mail ID for clarifications/Communication npgurazala@gmail.com

Sd/-A.M Srinivasa Rao, Commissioner,
Gurazala nagar Panchayat: GURAZALA

ప్రభుత్వాల విధానాలతో రైతులు, కార్మికులకు ఇబ్బంది

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఈ నెల 16వ తేదీన భారత గ్రామీణ బంద్, పారిశ్రామిక వాడల్లో సమ్మె చేయనున్నట్లు అఖిలపక్ష నాయకులు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఆర్‌టి సెంటర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశానికి ఎఐటియుసి ఏరియా సమితి కార్యదర్శి నాగబైరు సుబ్బాయమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 13వ తేదీన జీపు ప్రచారం చిలకలూరిపేట, మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక,పట్టణ పారిశ్రామిక విధానంతో రైతులు,కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, పరిశ్రమలు మూసి వేస్తున్న పట్టించుకోని విధానాలకు నిరిసిస్తూ నిర్వహించే ఈ బంద్, సమ్మెలో రైతులు, కర్షకులు, అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణమాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపశమన చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని, రెండు వందల రోజులకు ఉపాధి హామీ పెంచాలని, కనీస వేతనం రూ.600 గాను, రెండు పూటలా పని విధానాన్ని అమలు చేయాలని, ఆన్లైన్ మస్టర్ రద్దు చేయాలని డి మాండ్ చేశారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలన్న మొదలైన డిమాండ్లు చేశారు. 15 అంశాలతో కూడిన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమ పూర్తి మద్దతు తెలిపాయి. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి కళామందిర్ సెంటర్ వరకు ర్యాలీ జరుగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు, కార్మికులు అఖిల పక్ష పార్టీలు,దళిత,గిరిజన, ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు కన్వీనర్ పెరుబోయిన వెంకటేశ్వర్లు, సాతు లూరి లూథర్, అన్ని సంఘాల నాయ కులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలపర్తి గాయత్రికి చెక్కు అందిస్తున్న మట్టా సుబ్రమణ్యం

'జై భారత్' విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-క్రోసూరు

సత్తెనపల్లి పరిసర ప్రాంతాల 10వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్ట్స్‌పై నత్తెనపల్లిలోని ఎస్.బి.జి విద్యా సంస్థలలో ఇటీవల నిర్వహించిన ట్యాలెంట్ టెస్టులో క్రోసూరులోని జై భారత్ స్కూల్ కు చెందిన పాలపర్తి గాయత్రి ప్రథమ బహుమతి సాధించింది. ఎస్.బి.జి విద్యా సంస్థల చైర్మెన్ మట్టా సుబ్రమణ్యం చేతుల మీదుగా రూ. 15,000 చెక్కు, మెమెంటోను గాయత్రి అందుకున్నట్లు జై భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ టి. జైనేంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని గాయత్రి బహుమతి సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. టాలెంట్ టెస్ట్ ల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చని అన్నారు. గాయత్రిని జైనేంద్రా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఎంఎఎం ఫార్మసి కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట స్థానిక కేసానిపల్లిలో గల ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యార్థులు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎఎం గ్రూప్ ఆఫ్ కళాశాలల అధినేత ఎం.రామశేషగిరిరావు, డైరెక్టర్ డి. శ్రావ్య, మేనేజ్మెంట్ సభ్యులు రామ్మోహన్,కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరూ తమ కళాశాలలో ఉన్న వనరులను ఉపయోగించుకొని భవిష్యత్తులో కళాశాలకు ,తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం ఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ సత్ప్రవర్తనతో తోటి విద్యార్థుల పట్ల స్నేహ భావంతో మెలగాలన్నారు. కళాశాల నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో, విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు చేశారు.

ఆలయాన్ని సందర్శించిన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి-దుర్గి

మండలం లోని నిదానంపాటి శ్రీలక్ష్మి ఆల యాన్ని ఆదివారం మాచర్ల మున్సిప ల్ అడిషనల్ జూనియ ర్ సివిల్ జడ్జి శారద సందర్శిం చారు. ఆమెను అదికారిక లాంఛనాలతో స్వాగతిం చారు. అనంతరం ఆమెను ఆలయ ఎ.సి . సైదమ్మ బాయి,ఆ లయ అర్చకులు సత్కరించారు. ఇదిలా ఉండగా, నిదానంపాటిశ్రీలక్ష్మి ఆల యఈఓ గాసుధీర్ఘ కాలంగా పని చేసి బదిలీ పై వెళుతున్న గిరిరా జు నరసింహబాబు ను సైదమ్మ బాయి సమక్షంలోనే ఆలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

3వ సెమిస్టర్‌లో 'కృష్ణవేణి' డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

షేక్ షబ్నా మారా | హేమ | మోమిన | వెంకట కల్పన

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో డిసెంబర్ గత ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు యూనివర్సిటీ స్థాయి ఫలితాలు సాధించి తమ కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యా ర్థులను ప్రత్యేకంగా అభినందించారు. తమ కళాశాలలో బీఎస్సీ ఎంపిసిఎస్ విద్యార్థిని 750 మార్కులు గాను 715 మార్కులు సాధించగా, బిఎస్సి ఎంపిసి విద్యార్థిని షేక్ షబ్నా మారా 709 మార్కులు సాధించిందన్నారు. ఎంపీసీఎస్ విద్యార్థిని హేమ 703 మార్కులు, వెంకట కల్పన 692 మార్కులు, బీకాంలో సయ్యద్ మోమిన కౌసర్ 700 మార్కులకు గాను 645 మార్కులు సాధించారని వివరించారు. అన్ని గ్రూపులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ నాతాని, డైరెక్టర్ కోమటినేని నాసరయ్యలతో పాటు కళాశాల సిబ్బంది సతీష్, డాక్టర్ యోగేశ్వరరావు, వై శ్రీకాంత్ అధ్యాపకులు అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అమరావతి-ప్రజాశక్తి

దేశ కార్మిక హక్కులు కాలరాస్తూ కిసాన్ మోర్చా రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు రైతాంగ కార్మిక సంఘాలు ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్న గ్రామీణ బందును

జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బైరా పట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలో సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి పెద్దకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఏఐటీయూసీ నాయకులు మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి బిసూరిబాబు మాట్లాడారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వై.శివ ప్రదీప్,వైద్య సేవలు కోసం వరుస కట్టిన తండా వాసులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని లక్ష్యంతో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్ అధినేత డాక్టర్ యనమదల శివప్రదీప్ అన్నారు. రొంపిచర్ల మండలంలోని మారుమూల గ్రామమైన చాకలికుంట తండాలో ఆదివారం నరసరావుపేట మాక్స్ కేర్ సాయి తిరుమల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఎంపిటిసి సోమ్లా బాయ్ ప్రారంభించారు.ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని తండాకు చెందిన 300 మందికి పైగా తండావాసులకు బిపి,షుగర్,జలుబు,దగ్గు,జ్వరం వంటి సాధారణ వ్యాధులతో పాటు గుండె వ్యాధులకు కూడా పరిక్షలు చేశామని డాక్టర్ శివ ప్రదీప్ తెలిపారు. మారుమూల గ్రామమైన చాకలికుంట తండాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం సంతప్తినిచ్చిందన్నారు. తమ హాస్పిటల్ లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.ఆరోగ్యశ్రీ తో పాటు అన్ని కంపెనీల ఇన్సూరెన్స్ కంపెనీల నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ హాస్పిటల్ లో ఎముకలు కీళ్లు,వెన్నుపూస మెదడు నరాలు జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు క్యాన్సర్ వ్యాధి వైద్య నిపుణులు అన్ని వేళల అందుబాటులో ఉంటారన్నారు. పల్నాడు ప్రజలు తమ హాస్పిటల్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ శివ ప్రదీప్, డాక్టర్ శ్రీ హర్షలకు సర్పంచ్ బికారి నాయక్, ఉపసర్పంచ్ నరసింహ నాయక్ లు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని కొత్తపల్లిలో నరసరావుపేట కు చెందిన మ్యాక్స్ కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ లో జిఓ 56 ద్వారా తీసుకొచ్చిన రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు నాసరయ్య, డాక్టర్ చిన్నమ్మలు కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో టీచర్ల పోరాట ఫలితముగా రద్దుచేసిన అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడం సరికాదన్నారు డీఎస్సీలో పోస్టులు పెంచాలని ఓపిఎస్ పెంచాలని కోరారు.

సత్తెనపల్లిలో ఉచిత రక్తపరీక్షల శిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఉచిత రక్తపరీక్షల శిబి రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని 15,16 వార్డుల్లో నిర్వహించిన ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి యెలినేడి రామస్వామి , రాష్ట్ర కార్య దర్శి చౌట శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వరరావు జానీ బాబు పాల్గొన్నారు.

వాగ్దానాలను విస్మరించి మోసం చేసిన కేంద్రం

బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు 16న నిరసన - గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె - జయప్రదానికి ప్రజా సంఘాల పిలుపు

మంగళగిరి రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఐతానగర్‌లో మహిళ పాడి రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

కార్మిక సంఘాలు, రైతు సంఘాలు సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఎ.ప్రభాకర్ సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజి. ఎఐఎఫ్‌టియు నాయకులు కె.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసి కార్పొరేట్లకు అప్పగించే విధంగా చట్టాలు మారుస్తోందని, దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం జరిగిందని చెప్పారు. ఆ సందర్భంలో పంటలకు మద్దతు ధర ఇస్తామని చేసిన వాగ్దానాన్ని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. రైతు సంఘం నాయకురాలు వల్లూరి భారతి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుంటే మన రాష్ట్రంలో భూములు మాయం చేసే విధంగా భూ చట్టాలను తీసుకొస్తున్నారని అన్నారు. ఇది రైతుల భూములను వివాదాల్లోకి నెట్టుతుందని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ పారిశ్రామిక వివాదాల చట్టాల్ని మార్చేసి 4 కోడ్లుగా చేసి కార్మికవర్గాన్ని కాల్చుకు తినే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ఎఐటియుసి నాయకులు చిన్ని సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక చట్టాలు మార్చి కార్మికులను నిరంకుశంగా పని చేయించుకునే విధంగా పని గంటలు మార్పులు చేసి కార్మికుల్ని ఇబ్బందులు గురి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి వి.పూర్ణ, ఎఐఎఫ్‌టియు నాయకులు ఆదినారాయణ, ప్రజా సంఘాల నాయకులు యు.దుర్గారావు, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు అన్నిరకాల పంటలకు మద్దతు ధర చట్టం తేవాలని కోరుతూ ఈనెల 16న జరిగే గ్రామీణ బందులో మహిళ పాడి రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మలకా శివసాంబిరెడ్డి కోరారు. ఆదివారం వేజెండ్ల తబిత అధ్యక్షతన స్థానిక ఐతానగర్‌లో సమావేశం నిర్వహించారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ పశుగ్రాసం, తౌడు, దాణా ఖర్చులు పెరగడంతో పశుపోషణ భారంగా మారిందన్నారు. వీటితోపాటు పశు వులచావడి నిర్మాణానికి రూ.లక్షా 60 వేలు హామీలేని రుణం ఇచ్చే అవకాశం ఉన్నా బ్యాంకు అధికారులు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. రైతు రుణాలు మాఫీ చేస్తూ కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని కోరుతూ జరిగే బంద్‌ను ప్రజలంతా జయప్రదం చేయాలన్నారు. కె.శకుంతల, ఎం.రజిని, సరోజినీ, సుశీల, ఇ.బేబీరాణి, కమలమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

శ్రమలేని జీవన విధానంతో కీళ్ల సమస్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ఫాస్ట్‌ఫుడ్స్, శ్రమలేని జీవన విధానమే కీళ్ల వాతంకు మూలమని రుమటాలజిస్ట్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో టి.వి.సాయిరామ్ సమన్వయ కర్తగా నిర్వహించిన ఆరోగ్యసభలో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ అనారోగ్య ఆహార అలవాట్ల వల్ల, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవటం వల్ల ఈ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వస్తుందన్నారు. కండరాలు బిగుసుకుపోవటం, జాలు, నొప్పి, ఈ రుమటాలజీ లక్షణాలు అని అన్నారు. ఈ సమస్యతో బాధపడే వారు మాంసాహారం, పులుపు, శనగపిండి, మైదాలాంటి వాటితో తయారు చేసిన ఆహారానికి తీసుకోకపోవటం మంచిదన్నారు. ఈ సమస్య వచ్చిన వారికి మెడనొప్పి, కాళ్ల పట్టుకుపోవటం, చేతివేళ్ళు, కాలి వేళ్ళ వంగిపోవటం, బుజంనొప్పి వంటి సమస్యలకు గురవుతారన్నారు. ఈ సమస్య ఎక్కువగా మహిళలలో చూస్తుంటామని, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వస్తే ఎక్కువగా నడుంనొప్పి చూస్తుంటామన్నారు. సోరియాసిస్ గురించి వివరిస్తూ చర్మం పొలుసులుగా మారటాన్ని సోరియాసిస్ అంటామని, వ్యాధి నిరోధకశక్తి లోపించినా కూడా ఈ సమస్య వస్తుందన్నారు. ఇటీవల కాలంలో ప్లాస్మారిచ్ థెరపీ అందుబాటులోకి వచ్చిందని, ఇటువంటి అధునాతన వైద్యం ద్వారా రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు మంచిగా వైద్యం చేయవచ్చన్నారు. అనంతరం డాక్టర్ మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది టిజెవి శ్రీనివాస్, సీనియర్ అవగాహన సభ్యుడు ప్రొఫెసర్ ఆర్.రామచంద్రరావు, ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ మేనేజర్ సిహెచ్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల కంటే ప్రమాదకరంగా డిజిటల్ వ్యసనం

సదస్సులో పలువురి పరిశోధనా పత్రాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సైకాలజీ విభాగం, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్లు 'డిజిటల్ టెక్నాలజీ యూత్ మెంటల్ హెల్త్' అంశంపై సంయుక్తంగా నిర్వహించిన మూడ్రోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. 8 సెషన్లలో వంద పరిశోధన పత్రాలు, రాగ వాటిల్లో 40 పరిశోధన పత్రాలు చర్చకు వచ్చాయి. వీటిల్లో 18 పరిశోధన పత్రాలు విదేశీయులు సమర్పించారు. యువత, చిన్న పిల్లలు మొబైల్ వాడే వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత మార్పులకు అనుగుణంగా ఎదగాలని, డిజిటల్ వినియోగం అవసరం మేరకే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహజంగా మానవ శరీరానికి డ్రగ్స్ మాదకద్రవ్యాలు ఎంత ప్రమాదకరమో అంతకుమించి డిజిటల్ వినియోగం చెడు ప్రభావాలను చూపిస్తున్నట్లు సదస్సులో పలు పరిశోధన పత్రాలు ప్రచురించారు. చిన్నపిల్లల్లో మొబైల్‌కు బానిసలుగా మారే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉందని, ఇది కుటుంబంలో తల్లిదండ్రులకు మానసిక రుగ్మతలు వచ్చేందుకు కారణమవుతోందని, మొబైల్ వాడకండి నిలిపివేస్తే చిన్నపిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందనేది స్పష్టంగా ఉదాహరణలతో పరిశోధన పత్రాలు వచ్చాయి. నేటి రోజుల్లో చిన్నపిల్లలు మొబైల్ ఉంటేనే భోజనం చేయటం, హోంవర్క్ చేయటం పరిపాటిగా మారింది. ఆ వ్యసనాల నుంచి వారిని దూరం పెట్టే క్రమం తల్లిదండ్రులకు పెద్ద సవాలుగా మారింది. ఇటువంటి అంతర్జాతీయ సదస్సుల ద్వారా మేధావులు, పరిశోధకులు శాస్త్రీయ అధ్యయనాలు జరిపి సమాజ పురాభివద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్‌రెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి, కన్వీనర్ డాక్టర్ టిడి విమల, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎం.వసంతరావు, సైకాలజీ విభాగం అధ్యాపకులు కృష్ణమోహన్, డాక్టర్ చంద్రిక, అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, సైకాలజీ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్, వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్ధయ్య అన్నారు. లోకేష్ సహకారంతో మంగళగిరి వాలీబాల్ లీగ్-3 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం (భోగి ఎస్టేట్స్)లో పోటీలను స్థానిక టిడిపి, జనసేన నాయకులతో కలిసి అబద్ధయ్య ప్రారంభించి మాట్లాడారు. 58 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.లక్షను మంచికలపూడి వైష్ణవి - మాలెపాటి పుల్లయ్య చౌదరి అందిస్తారని, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలను బొర్రా సాయి అరవింద్, తృతీయ బహుమతి కింద రూ.25 వేలు నగదును ఇట్టా పెంచలయ్య అందిస్తారని తెలిపారు.

జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ విస్తృత సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా విజయభాస్కరరావు, ఉపాధ్యక్షులుగా ఆర్ఎన్ వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా షేక్ సంధాని, కోశాధికారిగా జి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఎన్నికను రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రభాకర్, సౌత్ ఇండియా అసోసియేషన్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా అసోసియేషన్ నాయకులు దినేష్, మల్లేష్, వెంకటేశ్వరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లా అధ్యక్షులుగా వ్యవహరించిన జి.పుల్లేశ్వరరావు పవర్‌లిఫ్టింగ్‌లో జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని రామచంద్రా పురానికి చెందిన ఆళ్ల కోటిరత్నమ్మ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికల కమిషన్ అధికారులు ఆమెను ఆదివారం సత్కరించి ప్రసంసాపత్రాన్ని అందజేశారు. ఈమె కుమారుడు ఆళ్ల రంగారెడ్డి మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు.

ఎదగాలంటే చదువే ప్రదానం

జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

చినకాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్, రామా దంపతులు ఆదివారం సందర్శించారు. బాలబాలికలకు పండ్లు పంపిణీ చేసి, శరణాలయానికి రూ.10 వేల సాయం అందించారు. రవికాంత్ మాట్లాడుతూ శరణాలయం కార్పొరేట్ స్థాయిలో ఉందన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే విద్య ప్రధానమని, విద్యను అలక్ష్యం చేయొద్దని చెప్పారు. అప్పుడప్పుడూ వస్తుంటానని, శరణాలయం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు-1 డిపో సూపర్నెంట్ బి.బాలునాయకు, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, నిర్వాహకులు సంధ్యారాణి, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ముస్లిములను ఓటు బ్యాంకుగా చూడకుండా వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాజీ కౌన్సిలర్ షేక్ మహ్మద్ రఫీ అన్నారు. స్థానిక 29వ వార్డులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించగా రఫీ మాట్లాడుతూ ఏ పార్టీ అయితే ప్రాధాన్యత, నమ్మకం, కల్పిస్తుందో వారికే మద్దతిస్తామని చెప్పారు.

పల్నాడు జిల్లా కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా షేక్ సైదా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పార్టీ సంస్థ గత నిర్మాణ క్రమంలో భాగంగా రానున్న ఎన్నికల దృష్ట్యా పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు షేక్ సైదాను నియమిస్తూ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని అన్నారు పల్నాడు జిల్లాలోని నరసరావుపేట పార్లమెంటు తో పాటు 7. అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో పార్టీ సంస్థాగత నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని, త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయనున్నట్లు చెప్పారు. తనకి బాధ్యతలు అప్పజెప్పిన వైయస్ షర్మిల, సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి, ఎఐసిసి కార్యదర్శి ఏపీ ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్, ఏఐసిసి కార్యదర్శి సి.డి. మేయప్పన్, గిడుగు రుద్రరాజు, కవీపీ రామచంద్రరావు, పల్లం రాజు, తులసి రెడ్డి , కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్వలికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

'జగనన్నకు చెబుదాం' రేపటికి వాయిదా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన సమావేశ మందిరంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం కార్యక్రమం అధికారికంగా నేడు (అనగా సోమవారం) జరగాల్సిన కార్యక్రమాన్ని రేపటికి (మంగళవారం) వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే కక్షిదారులు సహకరించాలని కోరారు.

సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయండి

ప్రజాశక్తి-అమరావతి

ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించి నష్టపరిహారం చెల్లించాలని, రైతాంగ ప్రయోజనాల అనుగుణంగా సమగ్ర పంట బీమా పథకాన్ని అమలు చేసి రైతాంగ హక్కుల పరిరక్షించాలని యువజన కాంగ్రెస్ పల్నాడు జిల్లాఅధ్యక్షుడు గంటా గోపి డిమాండ్ చేశారు. గోపి మాట్లాడుతూ ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు ధారాతత్వం చేస్తూ దేశ సంపదను యదేచ్ఛగా దోచుపెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాల్ని సభ్యసమాజం ఎండగట్టేందుకు ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ బందు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు అగస్టీన్ సిపిఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, సిపిఐ నాయకులు కె యేసు, సి ఐ టి యు నాయకులు నజీర్, మహమ్మద్, రఫీ, టి ఎన్‌టియుసి షేక్ జాన్ సాహెబ్ ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నండూరి వెంకటేశ్వరరాజు, రత్నబాబు, ఉదయ శంకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ధూళిపాళ్ల మాజీ సర్పంచ్ సత్యం మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల మాజీ సర్పంచ్ చిలకా సత్యం (60) అనారోగ్య కారణంతో ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందారు. మృతుని భార్య చిలకా బుజ్జి టిడిపి తరపున జెడ్పీ టీసీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవల మాజీ సర్పంచ్ జనసేన పార్టీ లో చేరారు. సత్యం మరణ వార్త విన్న జనసేన పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి బొర్రా వెంకట అప్పారావు, జనసేన నాయకులు సానుభూతి తెలిపారు.

అనవసర ఆరోపణలతో అబాసుపాలు కావొద్దు

అరవిందబాబు ఆరోపణలపై ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి ఖండన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగుదేశం పార్టీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనపై చేసిన ఆరోపణలు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఖండించారు.

నరసరావుపేట మండలంలోని వినుకొండ రోడ్డులో ఉప్పలపాడు గ్రామ సమీపంలో గల సాయి బాలాజీ వెంచర్ లో మొత్తం 45 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అదే భూమిలో రైతులు పొలం వెళ్లే బాట ఆక్రమించానని అరవిందబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయి బాలాజీ వెంచర్ లో ఆక్రమించానని డాక్టర్ చదలవాడ చెబుతున్న భూమిని చూపిస్తే తనకే రాసిస్తానని రైతులు పొలం వెళ్లే బాట ఆక్రమించానని ఆరోపిస్తున్న బాటకు ఏర్పాటు చేసిన వెంచర్ కు అసలు సంబంధం లేదని వెంచర్ కు సమీపంలో బాట ఉందో లేదో చూడకుండా అసత్య ఆరోపణలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. చదలవాడ చెప్పిన సర్వే నెంబర్లకు సాయి బాలాజీ వెంచర్ లోని భూములకు ఎటువంటి సంబంధం లేదని



సాయి బాలాజీ వెంచర్ మ్యాప్ చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

సాయి బాలాజీ వెంచర్ ఏర్పాటుకు భూములు కొనుగోలు చేసిన రైతుల వివరాలను వెల్లడించారు. అరవిందబాబు ఆరోపిస్తున్న సర్వే నంబర్లలో గల భూములు రైతులకు చెందినవని, ఆ భూములను సంబంధిత రైతుల ఆధీనంలో ఉన్నాయని వెల్లడించారు.

అరవిందబాబు తన అనుయాయుల మాటలు విని అనవసరంగా అభాసుపాలు కావొద్దని, ఆరోపణలు చేసే ముందు తగిన ఆధారాలు ఉండాలని హితవు పలికారు. ఏ ప్రభుత్వ భూమిని కానీ, ఏ వ్యక్తుల భూమి కానీ ఆక్రమించుకోలేదని స్పష్టం చేశారు. నిత్యం అబద్ధాలు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చదలవాడ చూస్తున్నారని విమర్శించారు. ఇంతవరకు నరసరావుపేట టిడిపి అసెంబ్లీ అభ్యర్థిగా ఇంకా అధిష్టానం ప్రకటించక ముందే తాను ఎమ్మెల్యే అయినట్లు అరవిందబాబు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

క్రైస్తవులపై దాడులకు మౌన ప్రదర్శనతో నిరసన

ప్రజాశక్తి - రెంటచింతల

క్రైస్తవ సంఘ నేతలపై దాడులు నిరసిస్తూ మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆర్.సి.యం చర్చి నుంచి పురవీధుల్లో ఆదివారం వందలాదిమందితో మౌన ప్రదర్శన చేశారు అనంతరం మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈనెల రెండవ తేదీన రెంటచింతలలోని కానుక మాత తిరుణాల సందర్భంగా తేరు ప్రదర్శన జరిగే సమయానికి ఓ పార్టీకి చెందిన వారు తమ జెండాలతో చర్చి లోపలికి వచ్చిన క్రమంలో చర్చి పెద్దలు, కమిటీ సభ్యులు ఆ జెండాలతో రావొద్దని, రాజకీయాలు తగవని వారికి చెప్పారు. అక్కడ మాటామాట పెరిగి వాదనపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన భౌతిక దాడులకు పాల్పడడమే కాకుండా కంప్యూటర్ సెంటర్‌ని ధ్వంసం చేశారు. ఈ చర్యను నిరసిస్తూ వందలాది మంది క్రైస్తవులు మహిళలు చిన్నారులు, పెద్దలు ఈ మౌన ప్రదర్శనలో పాల్గొన్నారు. దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఇటువంటి దాడులు మళ్ళీ జరగకుండా చూడాలని సంఘ నేతలు కోరారు.

సాధారణ వాహనాలకు ప్రత్యేక సైరనా!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మంత్రులు, అధికారులు, పోలీస్ వాహనాలకు, ఎమర్జెన్సీ సర్వీసులకు, ప్రత్యేక హోదా కలిగిన వ్య క్తుల వాహనాలకు ప్రత్యేక సైరన్ కేటాయించిన విష యం తెలిసిందే. అటువంటి సైరన్‌ను ఏ గుర్తింపు లేని వారు తమ వాహనాలకు ఏర్పాటు చేసుకోవడం ఆశ్చర్యం కలిగి స్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ఆ సైరన్‌ను వినియోగిస్తున్న వాహన చోదకులను పోలీసులు పట్టించు కోవడం లేదనే విమర్శలు ప్రజల నుండి వినవస్తున్నాయి. ఏది ఎమర్జెన్సీ వాహ నమో, ఏది కాదో తెలియని పరిస్థితి నెల కొందని చెబుతున్నారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎటువంటి సంబంధం లేని వారు సైతం ప్రభుత్వ వాహనం అని రాసి ఉండే స్టిక్కర్లు వేసుకుని కార్లలో, ఇతర వాహనాల్లో తిరుగుతున్న దాఖలాలు లేకపోలేదు. ఆయా విషయాలపై పోలీసులు దృష్టి సారించాలని, వాహన తనిఖీలు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వాహనదారులకు సరైన సూచనలు చేసి, అటువంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలో వైసిపి మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శంకరరావు

అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురంలో ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాబోయేది పెత్తందార్లకు పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అమ రావతిలో మండల వైసిపి కారా ్యలయాన్ని ఎమ్మెల్యే ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. అందిన సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పెదకూరపాడు నియోజకవర్గంలో వైసిపి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. చంద్రబాబు గెలిస్తే మళ్లీ లంచాల పాలన వస్తుందని, సంక్షేమ పథకాలు ఆగిపోతాయని హెచ్చరించారు. మళ్లీ జన్మభూమి కమిటీల అరాచకాలు అమలవుతాయన్నారు. అదే జరిగితే మళ్లీ పేదలు కష్టాలు పడతారన్నారు. వైఎస్ జగన్ ని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అందులో మొదటి గెలుపు పెదకూరపాడుదే కావాలని పిలుపునిచ్చారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం లోని ఏడవ మైలు,తాళ్లపల్లి,జమ్మల మడక గ్రామాలకు చెందిన 75 వైసిపి కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లో చేరారు. ఆదివారం మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.అనంతరం జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కి వస్తున్న ఆదరణ చూసి పెద్ద ఎత్తున వైసీపీ నుంచి టీడీపీ లోకి రావడం హర్షణీయం అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు .తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో కాసు వీరారెడ్డి,గద్దె రంగారెడ్డి,దుర్గంపూడి చెన్నారెడ్డి,తిరుపతి రెడ్డి,గద్దె దసరావ రామిరెడ్డి,శివారెడ్డి తదితరులు ఉన్నారు.

మెట్టు శ్రీనివాసరెడ్డికి సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - చేబ్రోలు

విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' పేరిట శతాధిక కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. నవభారత నిర్మాత సంఘం, గాంధీజీ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, నవ మల్లెతీగ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన కొండవీటి కమిటీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మెట్టు శ్రీనివాసరెడ్డి 'జండా ఉంచా రహే హమారా' అనే కవితకుగాను పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు నందమూరి లక్ష్మీపార్వతి, నవ మల్లెతీగ సాహితీ సంస్థ నుండి సాహితీ పురస్కారం, సత్కారం పొందారు.

తాగునీటిలో తగుమోతాదులోనే క్లోరిన్

- నగర కమిషనర్ కీర్తి చేకూరి
- పలు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు జిఎంసి పటిష్ట చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటల నుండి శ్రీనగర్, శారదా కాలని, వసంతరాయపురం, ఐపిడి కాలనీ, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మెడికల్ కాలేజిలోని రీజినల్ ల్యాబ్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరా సమయంలో నివాసాల వద్ద నుండి తాగునీటి నమూనాలు సేకరించి క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాధితులున్న ప్రాంతాల నుండి తాగునీటి నమూనాలు సేకరించామని, అందులో క్లోరిన్ శాతం తగిన మోతాదులోనే ఉన్నట్లు గుర్తించామని, కావున ప్రజలు ఆందోళనకు గురికావొద్దని అన్నారు. తాగునీటి సమస్యలపై యుద్ధ ప్రాతిపదికన స్పందించేందుకు జిఎంసి ప్రధాన కార్యాలయంలో 0863-2345103 కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. నీటి కాలుష్య అనుమానిత ప్రాంతాలైన శ్రీనగర్, శారదకాలని, సంగడిగుంట ప్రాంతాలకు ముగ్గురు డిప్యూటీ కమిషనర్లను ప్రత్యేక

తాగునీటి నమూనాలు పరిశీలిస్తున్న కమిషనర్

అధికారులుగా నియమించామన్నారు. ఉండవల్లి నుండి తక్కెళ్లపాడు హెడ్‌వాటర్ వర్క్స్ వరకు పైప్‌లైన్ పరిశీలనకు ఈఈ కొండారెడ్డి, హెడ్‌వాటర్ వర్క్స్, సంగం జాగర్లమూడి వాటర్‌వర్క్స్‌లో క్లోరినేషన్, ఫిల్టరేషన్, ల్యాబ్‌లో పరీక్షలను డిఈఈ హనీఫ్‌కు, హెడ్ వాటర్ వర్క్స్ నుండి తాగునీటి సరఫరాని ఈ.ఈ. శ్రీనివాస్, ఏఈ బాబర్‌లు, శారద కాలని, శ్రీనగర్, సంగడిగుంట ప్రాంతాల్లో త్రాగునీటి పైప్‌లైన్ల పరిశీలన, క్లోరినేషన్, ఎక్కడైనా లీకులు ఉంటే తక్షణ మరమ్మతులకు ఈ.ఈ. కోటేశ్వరరావు, డిఈఈలు రమేష్‌బాబు, మహ్మద్ రఫిక్, రాము, ఏఈలు అనూష, శ్రీకాంత్‌కు ప్రత్యేక విధులు కేటాయించామని వివరించారు. ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెట్టరాదని స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని బిఆర్ స్టేడియం, శారద కాలని, ఐపిడి కాలని, నల్ల చెరువు తదితర రిజర్వాయర్ల పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో 53 మంది ఎమినిటి కార్యదర్శులతో క్లోరిన్ స్యాంపిల్స్ కోసం ప్రత్యేక బందాలుగా ఏర్పడి 537 స్యాంపిల్స్ సేకరణ చేశారని, వాటిలో క్లోరిన్ తగు మోతాదులోనే ఉందని గుర్తించడం జరిగిందని తెలిపారు. అనంతరం శారదా కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశించారు. నగర ప్రజలు కూడా తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ (ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ (ఎఫ్ఏసి) మధుసూదన్ పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దాట్ల మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది దాట్ల మోహన్ రెడ్డి తెనాలి 11వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు హోంశాఖ ప్రధాన కర్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా జారీ చేసిన ఉత్తర్వులను మోహన్‌రెడ్డి అందుకున్నట్లు ఆదివారం తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి ఈ నియామకం ఉంటుందన్నారు. ఆయనకు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలి : స్థానిక పురపాలక సంఘ పరిధిలోని రజక ఐలమ్మ పార్కులో వాకర్స్ అసోసియేషన్, అమ్మ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో పలువురికి ఉచితంగా షుగర్, బిపి, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అమ్మ హాస్పిటల్ వైద్య బృందంతో పాటు ఎం.ప్రసాద్, పి.అర్జునరావు, కె.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిహారం కోసం నేడు ధర్నా

ప్రజాశక్తి - తెనాలి

కోల్డ్ స్టోరేజీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో దాదాపు 1100 మంది రైతులు పంటను కోల్పోయారని, తక్షణమే వారిని ఆదుకోవాలని రాష్ట్ర పసుపు రైతుల సంఘం అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం సంభవించి 1.15 లక్షల బస్తాల పసుపు దగ్ధమైందని, బాధిత రైతులకు న్యాయం కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని చెప్పారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ ప్రమాదం సంభవించిన రోజు ఉన్న ధర ప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు.

పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజని, మేయర్ తదితరులు

శ్రీనివాసరావుపేటలో పార్కును ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపునకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఆదివారం నగరంలోని 22వ డివిజన్ శ్రీనివాసరావు పేటలో రూ.37 లక్షలతో జిఎంసి అభివృద్ధి చేసిన పట్టంశెట్టి చిన్న రాఘవయ్య పార్కును మంత్రి ప్రారంభించారు. రూ.15 లక్షలతో సిసి రోడ్డుకు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడుతో కలిసి శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపునకు, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్థానిక ప్రజలుండేలా పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే నగరంలోని అనేక పార్కులను అభివృద్ధి చేశామని, ముఖ్యంగా గాంధీ పార్కును అభివృద్ధి చేశామని చెప్పారు. నగరంలో అవసరమైన ప్రాంతాలలో మౌలిక సదుపాయలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జి.నాగరంగమణి రమేష్, ఎన్.వెంకట రమణ పాల్గొన్నారు.

కలుషిత నీటి మరణాలు ప్రభుత్వ హత్యలే

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారమివ్వాలి : మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నరపాలక సంస్థ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని, కలుషిత నీటి మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నాయకులు మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో కాలుష్యం వెంటాడుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమయాక ప్రజల ప్రాణాలు పెద్దసంఖ్యలో గాల్లో కలుస్తున్నాయని అన్నారు. నగరంలో కలుషిత నీరు వస్తోందని ప్రజలు కొద్ది రోజులుగా గగ్గోలు పెడుతున్నా అధికార యంత్రాంగం స్పందించలేదన్నారు. కలుషిత నీటి బాధితులకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పైగా మంత్రి విడదల రజిని సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అనారోగ్యానికి గురైన వారందరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. వందల సంఖ్యలో బాధితులు ఉన్నప్పటికి ప్రభుత్వం బాధితుల సంఖ్యను తక్కువ చేసి చూపుతోందని, బాధితుల సంఖ్య గంట గంటకు పెరగడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. గిరిజనులు, బడుగుబలహీన వర్గాలు నివసించే ప్రాంతాల పట్ల మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణ కమిటీని నియమించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లను బాగు చేసి ప్రజలకు రక్షితనీటిని సరఫరా చేయాలని కోరారు.

కాల్వ కట్టలపై నివాసితులకు దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మలేరియా, డెంగి లాంటి విషజ్వరాలు రాకుండా దోమతెరలు కొంతమేరకు ఉపయోగపడతాయని ట్రైబల్ ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి పేర్కొన్నారు. మండలంలోని కొలకలూరులోని కాల్వగట్లపై నివసిస్తున్న వారికి ఆమె దోమతెరలు, బియ్యం ఆదివారం పంపిణీ చేశారు. అంటువ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్యశాఖ సూచించిన నియమాలను పాటించాలన్నారు. పేదల వాడల్లో విష సర్పాలు సంచారం ఎక్కువగా ఉండటం, మురుగు కాల్వల్లో దోమలు తిష్ట వేయడం వలన ప్రజలు ఆస్పత్రులు పాలవుతున్నారని చెప్పారు. ఇలాంటి దుర్భరజీవితాలు అనుభవిస్తున్న నిరుపేద గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్ కె.భూషణం, బి.పుల్లయ్య, చినరాయుడు పాల్గొన్నారు.

దోమతెరలు అందిస్తున్న అంజలి

రాట్నాలు అందిస్తున్న ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

25 మంది మహిళలకు రాట్నాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేతకు చేయూత కార్యక్రమంలో భాగంగా 9వ విడతలో మంగళగిరి పట్టణంలోని 27 వార్డుకు చెందిన 25 మంది చేనేత మహిళలకు చేనేత కమిటీ నాయకులు రాట్నాలు అందజేశారు. ఆదివారం మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో చేనేత కమిటీ నాయకులైన టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య, పట్టణ అధ్యక్షులు డి.రాజు, నాయకులు జి.ధనుంజయరావు, కె.అంకమ్మరావు ఆధ్వర్యంలో రాట్నాలను ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పంపిణీ చేసి మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'చేనేతకు చేయూత' పేరుతో నిరుపేద చేనేత మహిళ లబ్ధిదారులకు నూలువడికే రాట్నాల పంపిణీ చేస్తూ వారి భవితకు భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. నేతన్న నేస్తం పేరుతో వైసిపి ప్రభుత్వం నేతన్నలను దగా చేస్తోందని విమర్శించారు. వైసిపి పాలనలో నేతన్నలపై దాడులు, ఆరాచకాలు పేట్రేగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ మజీద్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇద్దరికి 'ఆలపాటి పెళ్లి కానుక'

ప్రజాశక్తి - తెనాలి రూరల్

ఆలపాటి పెళ్లి కానుకలో భాగంగా మండలంలోని మల్లెపాడుకు చెందిన కనకపాల రాఘవులు, శశికళ దంపతుల కుమార్తె పద్మశ్రీ, తెనాలి పట్టణ 28వ వార్డుకు చెందిన మల్లెల సర్వేశ్వరరావు, ప్రేమగీత దంపతుల కుమార్తె జ్ఞానసుందరి వివాహాలు సందర్భంగా వారిరువురికి ఉంగరాలు బహుకరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన పెళ్లి కానుకతో పాటు చీర, సారేలు స్థానిక టిడిపి నాయకులు అందించారు.

ముగిసిన కొండవీడు ఫెస్ట్

ప్రజాశక్తి - యడ్లపాడు, చిలకలూరిపేట

యడ్లపాడు మండలంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న ఫెస్ట్ నేపథ్యంలో ఆదివారం కొండవీడు కోటకు పర్యాలకులు పోటెత్తారు. ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఉదయం రెండోరోజు ఫెస్ట్ కార్యక్రమాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. తొలుత కొండవీడు ముఖద్వారం నుండి నిర్మాణంలో వున్న అతిథి గృహం దేవాలయాల సముదాయం వరకు రూ.5 కోట్లతో విస్తరించిన ఘాట్ రోడ్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలిసి మంత్రి రజిని ప్రారంభించారు. అనంతరం హెలీరైడ్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా వసంత రాజీయం వేదిక దగ్గరకు చేరుకొని సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. పక్కనే ఉన్న రాక్ క్లైమ్బింగ్, ఫ్లవర్ షో, సైకత శిల్ప ప్రదర్శన కొండవీటి కోట ప్రాకారం, ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు, అక్కడనుండి ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ, పుట్టాలమ్మ, వెదుళ్ల పేర్లు కలిగిన మూడు చెరువులను సందర్శించారు, వెదుళ్ల చెరువులో బోట్ షికారులు చేశారు. పారా మెడికల్, హాట్ ఎయిర్ బెలూన్, హార్స్ రైడింగ్, ఫొటో ఎగ్జిబిషన్, కీయా కింగ్ బోటింగ్, చిల్డ్రన్స్ ప్లే ఎగ్జిబిషన్‌లో సందర్శకులతో కలిసి సందడి చేశారు. సందర్శకులకు ఫుడ్ కోర్టులు, డి.ఆర్.డి.ఏ సంఘం తరఫున మహిళా సంఘాలు రకరకాల చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందజేశారు. మాంసాహార ప్రియులకు వైజాగ్ నుంచి అద్భుతమైన వంటకాలను తీసుకువచ్చి వడ్డించారు. అనంతరం వేదికపై క్లాసికల్ డాన్స్, వెస్ట్రన్ డాన్స్ ప్రదర్శనలిచ్చారు. వీరికి అతిథులు బహుమతులు అందజేశారు. జబర్దస్త్ టీమ్ సమీర్ భరద్వాజ్, మురళి పాటలను ఆలపించారు, జబర్దస్త్ టీం నుంచి రైజింగ్ రాజు, తన్మయి, రాజమౌళి, శాంత కుమార్ స్కిట్లను, నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు, ఎలక్షన్ కమిషన్ అసిస్టెంట్ అధికారి కోటేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

హెలీరైడ్‌లో మంత్రి విడదల రజిని, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్... ఫొటో ఎగ్జిబిషన్ గురించి మంత్రికి వివరిస్తున్న కలెక్టర్

నేడూ కొనసాగనున్న హెలికాప్టర్ రైడ్

కొండవీడు ఫెస్ట్‌కు విశేష స్పందన లభించడంతోపాటు హెలికాప్టర్‌రైడ్‌కు ఆదరణ లభించిందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ రైడ్ సోమవారమూ కొనసాగిస్తామని తెలిపారు. బుకింగ్ కోసం మహేష్-7483432752, 94003 99999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

భాష్యం స్పోర్ట్స్ మీట్‌లో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

చిన్ననాటి నుండే క్రీడలు మన జీవితంలో భాగమైతే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని సాధించవచ్చని ప్రముఖ పిడియాట్రిషియన్, నియోన టాలజిస్ట్ డాక్టర్ దేవాభక్తుని రాకేష్‌బాబు చెప్పారు. విద్యార్థులందర్నీ ఒకచోటకు చేర్చి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహిస్తూ వారిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్న భాష్యం విద్యాసంస్థల కృషి అభినందనీయమని అన్నారు. ఆదివారం స్థానిక గోరంట్ల భాష్యం, రామసేతు క్యాంపస్ గ్రౌండ్‌లో జరిగిన భాష్యం గుంటూరు అర్బన్‌జోన్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి, వారిని సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉంచాలని, వారు ఏం చేస్తున్నారో ఒక కంట కనిపెట్టాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి భోజనం కంటే మించింది లేదని, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. తొలుత డాక్టర్ రాకేష్‌బాబు క్రీడా జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించి, పావురాలను ఎగురవేసి స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్‌లో నిర్వహించిన వివిధ రకాల క్రీడలు వీక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు భాష్యం విద్యాసంస్థళ చైర్మన్ రామకృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం గుంటూరు అర్బన్-1 జెడ్‌ఈవో శివ, అర్బన్-2 జెడ్ ఈవో స్వప్న, భాష్యం ఐఐటి ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారంభ సభలో మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్‌బాబు

విజేతలకు బహుమతులిస్తున్న అతిథులు

ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మాజేటి గురవయ్య డిగ్రీ కాలేజి ఆడిటోరియంలో సౌత్‌జోన్ రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు సుమారు 150 మంది తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాల నుండి పాల్గొన్నారన్నారు. విన్నర్స్‌గా ఆంధ్రప్రదేశ్, రన్నర్స్‌గా తమిళనాడు జట్లు నిలిచాయి. అనంతరం డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బోసుబాబు అధ్యక్షతన జరిగిన ముగింపు సభ జరిగింది. కాలేజి పాలక మండలి అధ్యక్షులు జి.పూచంద్రరావు, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.ప్రభాకర్, సీతారామ గ్రూప్స్ అండ్ అర్బన్ మైదాన్ చైర్మన్ మామిడి సీతారామయ్య విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అన్ని వయస్సుల వారిలోనూ మానసిక సమస్యలు

ప్రజాశక్తి - గుంటూరు

నేటి సమాజ పరిస్థితులు అన్ని వయసుల వారిలో మానసిక సమస్యలు, రుగ్మతలకు కారణమవుతున్నాయని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) మానసిక వైద్య విభాగం అధిపతి డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి అన్నారు. ఆదివారం బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భ:గా నిర్వహించిన సభకు సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ వహించారు. డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా మానసిక ఒత్తిడి, ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ పెరిగిపోతున్నాయి అన్నారు. విద్యా విధానం మొదలుకొని జీవన విధానం వరకు అన్ని అందుకు కారణమని చెప్పారు. యువతలో, మేధావులలో స్కిజోఫినియా, మానియా వంటి దీర్ఘకాల మానసిక వ్యాధులు, స్త్రీలలో ఓసిడి, హిస్టీరియా వంటి సమస్యలు, మధ్య వయసులలో, వృద్ధులలో మతిమరుపు, డైమెన్షియా ,అల్జీమర్స్ వంటి సమస్యలు ఎక్కువగా గుర్తిస్తున్నట్లు చెప్పారు. తొలి దశలోనే మానసిక రుగ్మతలను, సమస్యలను గుర్తింస్తే మందుల అవసరం లేకుండా జీవనశైలిలో మార్పులు, కౌన్సెలింగ్ ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. అన్ని రకాల మానసిక వ్యాధులకు చికిత్స లున్నాయని, సమస్యల్ని వైద్యులతో చెప్పడానికి ముందుకు రావాలని చెప్పారు. డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ అధిక బీపీ, షుగర్, క్యాన్సర్ బాధితుల్లో డిప్రెషన్ గురికావడం సహజమని, వారికి వైద్యుని కౌన్సిలింగ్ అవసరమవుతుందని అన్నారు. వ్యాధుల గురించి ఆలోచిస్తూ డిప్రెషన్‌కు గురికావడం మంచిది కాదన్నారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడారు. సంస్థ కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, సభ్యులు సిహెచ్ .శివాజీ, కె.సత్యనారాయణ, జి.లింగారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.ఉమాజ్యోతి

రేపు కోల్డ్‌స్టోరేజీ బాధిత పసుపు రైతుల సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి : శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితుల సమావేశం మంగళవార ఉదయం పది గంటలకు దుగ్గిరాల టర్మరిక్ అసోసియేషన్ హాల్ (రైలుపేట)లో నిర్వహిస్తామని పసుపు రైతు సంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, బాధిత రైతుల కమిటీ కన్వీనర్ వి.వెంకటరామయ్య, కో-కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతులకు సంబంధించి తమ డిమాండ్లను అధికారులు, ప్రభుత్వం ముందు పెట్టే విషయంపై సమావేశంలో చర్చిస్తామని, బాధిత రైతులంతా పాల్గొనాలని కోరారు.

పక్షులు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా లేబర్ కోర్టు జడ్జి

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్ : మండల పరిధిలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని లేబర్ కోర్టు జిల్లా జడ్జి డి.తిరుమలరావు ఆదివారం సందర్శించారు. తక్కువ స్థలంలో ఎక్కువ పక్షులను చూడటం చాలా ఆహ్లాదకరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయనవెంట డిఆర్‌ఓ వెంకటేశ్వరరావు, సంతోష్, పక్షుల కేంద్ర చైర్మన్ అనిల్ కుమార్ ఉన్నారు.

సమ్మె ఒప్పంద హామీలు అమలు చేయాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమ్మె విరమణ సందర్భంగా జరిగిన ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు సంబంధించిన జిఒలు వెంటనే విడుదల చేయానలి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎవిఎన్.కుమారి అధ్యక్షతన యూనియన్ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజులు పాటు నిరవధికంగా సమ్మె నిర్వహించామని, సమ్మె ముగిసి మూడు వారాలైనా నేటికీ ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన జీవోలు విడుదల కాలేదన్నారు. ముఖ్యంగా సమ్మె కాలం జీతం జీవో ఇవ్వలేదన్నారు. అంత్యక్రియల ఖర్చులకు సంబంధించిన జీవో, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంపుదల తదితర అన్ని జీవోలను తక్షణమే జారీ చేయాలని కోరారు. ఒప్పందంలో భాగంగా కొన్ని సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్న త్రైపాక్షిక కమిటీని కూడా వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో హెల్పర్ల పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని దీనివల్ల సెంటర్ల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఖాళీలన్నింటినీ నెలరోజుల్లోగా భర్తీకి జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు టి.రాధ, సుకన్య, ప్రేమలత, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దీప్తి మనోజ